క్లుప్తంగా

బాధితులకు చేయూత



ఆత్మకూర్: వరద బాధితులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేయూతనందించింది. బుధవారం మండలంలోని గ్రామాల్లో ఇళ్లు కూలిపోయిన 10 మంది బాధిత కుటుంబాలకు స్టీల్ వంట సామగ్రి, టార్పాలిన్ కవర్లు, దుప్పట్లు, ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సయ్యద్‌కలాంపాష, రాజేందర్‌కుమార్, సర్దార్, ఆలీ గ్రామస్తులు ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఆత్మకూర్: నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురయిన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి బుధవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్ మండలంలోని మూలమల్లకు చెందిన వెంకటన్న ఫిబ్రవరి తొమ్మిదవ తేదీన అమరచింత పట్టనంలో జరిగిన ఓ వివాహంలో సెల్‌ఫోను చోరీకి గురయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని హైదరాబాద్‌లో కనుక్కొని రికవరీ చేసి అప్పగించినట్లు తెలిపారు. సెల్‌ఫోన్లు చోరీకి గురయినా.. లేదా పోగొట్టుకున్న సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని సూచించారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి



ఆత్మకూర్: ఓటు ఎంతో విలువైందని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజు, ఎస్ఐ నరేందర్, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఓటు హక్కు వినియోగంపై కళాజాతా బృందంతో మాక్ పోలింగ్‌ను నిర్వహించి ఈవీఎంలపై అవగాహన కల్పించారు.

మరణించిన ఓటర్ల పేర్లు తొలగించాలి

వనపర్తి టౌన్: మరణించిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం మాజీ మంత్రి చిన్నారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఓటర్ జాబితాలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఎలక్షన్ కమిషన్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీలత రెడ్డి, నందిమల్ల యాదయ్య, పర్వతాలు, కదిరె రాములు, దివాకర్ యాదవ్, వెంకటేష్,జానకి రాములు, వెంకట్ నారాయణ, గణేష్ గౌడ్, పెంటన్న, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

20 కేకేటీ 108ః-ఆత్మకూర్‌లో ఓటుహక్కు గురించి అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాధితులను ఆదుకోవాలంటూ వినతి



పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా పెబ్బేరు చౌరస్తా నుంచి జూరాల కాల్వ వరకు ఇళ్లు, షాపులు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలంటూ బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్డు విస్తరణ చేసేటప్పుడు పనులను అడ్డుకుంటే నష్టపరిహారం ఇస్తామని చెప్పిన అధికారులు నేటికీ ఇవ్వడం లేదని, షాపులు, ఇళ్లు కోల్పోయిన వారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని వివరించారు. రోడ్డు విస్తరణకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా సహకరిస్తుందని, నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, వెంకట్రాములు, గంధం రాజు, రాములుయాదవ్, దయాకర్‌రెడ్డి, షకీల్, సునీల్, రాములు, సాయి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అమరచింత: నేతన్నకు చేయూత పథకంలో చేరిన 60 -65 సంవత్సరాల వయస్సు గల చేనేత కార్మికులు నేతన్నకు బీమా కోసం దరకాస్తు చేసుకోవాలని జౌళీ శాఖ ఏడీ గోవిందయ్య తెలిపారు.

ముందు పనులు.. తర్వాత టెండర్లు

- డీఆర్సీసీ నిర్మాణంలో అధికారుల తీరుపై అనుమానం
- మొదట రూ.5 లక్షలు.. అనంతరం రూ.10 లక్షలు



చింతలకుంట వద్ద పూర్తయిన డీఆర్సీసీ షెడ్

అమరచింత: పట్టణంలో సేకరించిన తడి, పొడి చెత్తను వేరుగా చేసే డీఆర్సీసీ షెడ్ నిర్మాణం పూర్తయి ఆరు నెలలు గడిస్తున్న తరుణంలో వాటికి మరోమారు టెండర్లకు ఆహ్వానిస్తున్న దుస్థితి అమరచింత మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. ఆరు నెలల కిందటే షెడ్ నిర్మాణ పనులు పూర్తయినా.. వాటికి గతంలో మంజూరైన నిధులు సరిపోవడం లేదంటూ రీటెండరింగ్ కోసం కాంట్రాక్టర్‌తో మున్సిపల్ అధికారులు నిర్ణయానికి వచ్చారు. పది రోజుల క్రితం రూ.10 లక్షలు డీఆర్సీసీ షెడ్ నిర్మాణం కోసం టెండర్‌ను ఆహ్వానించారు. దీంతో అసలు విషయం వెలుగు చూసింది. రెండేళ్ల కిందట వీటి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షలు మంజూరు చేశారు. కాగా నిర్మాణ సమయంలో సిమెంట్, ఇనుము ధరలు పెరగడంతో వీటి ప్రకారంగా బిల్లులు ఇవ్వాలని సదరు కాంట్రాక్టర్ పట్టుబట్టాడు. పనులను పర్యవేక్షించిన ఏఈ ధర్మరాజు మున్సిపల్ ఏఈగా అదనపు బాధ్యతల నుంచి తప్పుకోవడంతో బిల్లుల కోసం నిరీక్షించే పరిస్థితి దాపరించింది.

ఉన్న పనులకే మరోమారు..

జరిగిన పనులకే మరోమారు టెండర్లకు పిలిపించి సదరు కాంట్రాక్టర్‌తో కలిసి రూ.పది లక్షల బిల్లు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ప్రస్తుత ఏఈ తో కలిసి నిర్మించిన డీఆర్సీసీ షెడ్ కోసం టెండర్ వేయాలనుకున్నారు. అనుకున్నదే అదనుగా రూ.పది లక్షలతో టెండర్ వేసి అదే పనులను సదరు కాంట్రాక్టర్‌తో మమ అనిపించేందుకు యత్నిస్తున్నారు. దీనిపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు చెప్పడంతోనే..

అధికారులు చెప్పిన విధంగానే డీఆర్సీసీ షెడ్ నిర్మాణం కోసం రూ.పది లక్షల వ్యయంతో టెండర్ వేశాం. గతంలో పనులు జరిగాయన్న విషయం తెలియదు. ప్రస్తుతం ఇక్కడికి కొత్తగా ఏఈగా చేరాను. పనులు జరిగి ఉంటే మరోమారు పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం.

– సాయి కిరణ్, మున్సిపల్ ఏఈ

గత ఏఈ నిర్లక్ష్యం కారణంగానే..

గతంలో విధులు నిర్వహించిన ఏఈ, మున్సిపల్ కమిషనర్లు డీఆర్సీసీ షెడ్ నిర్మాణ పనుల కోసం నిధులు మంజూరు చేశారు. వాటికి ఎంత బిల్లు చేశారో అన్న వ్యవహారం తెలియదు. సదరు కాంట్రాక్టర్‌తో కలిసి అప్పట్లో జరిగిన పనులకు ఎంబీ చేయమని చెప్పాం. ప్రస్తుతం మరోమారు టెండర్ వేసి తనకు జరిగిన పనులకు బిల్లులు చేయమంటున్నారు. వీటిని పూర్తి స్థాయిలో పరిశీలిస్తున్నాం.

–మహ్మద్ ఖాజా, కమిషనర్, అమరచింత

పట్టణాభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా చేపడుతున్నామని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. బుధవారం పురపాలిక కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణంలో ఇది వరకే రూ.15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. పట్టణంలోని పది వార్డుల్లో రూ.3కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించామన్నారు. కార్యాలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కులో 16 రకాల పూల, ఇతర 40 రకాల ఇతర మొక్కలు నాటడంతో పాటు వాకింగ్ ట్రాక్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. స్థానికులు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

గుడులను బడులుగా మార్చిన మహనీయుడు



నారాయణ గురు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు, నాయకులు

వనపర్తి టౌన్: దళిత బహుజనులకు విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ఆలయాలను విద్యాసంస్థలుగా మార్చిన గొప్ప వ్యక్తి నారాయణ గురు అని ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. నారాయణ గురు వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. ఒకే కులం, ఒకే మతం, ఒకే దేవుడంటూ ప్రబోధించని, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహా శర్మ, మండ్ల దేవన్న నాయుడు, గంధం నాగరాజు, రాము, డప్పు నాగరాజు, మన్యం యాదవ్, పరమేశ్వరచారి, సత్యం చారి, గంగాధర్ చారి, మాధవచారి తదితరులు పాల్గొన్నారు.


ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న శ్రీరామ్

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన గ్రామంలోని బీసీ కాలనీ, ఉమ్మడి శ్మశాన వాటిక, రేషన్ దుకాణం, రోడ్డు విస్తరణ, ఎస్సీ ఇళ్ల స్థలాలను పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల సర్వే నెం.627లో బీసీలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారని, పట్టాలు తీసుకున్న వారు ఇళ్లు నిర్మించుకునేందుకు నీటి వసతి, మంగళ్లపల్లి స్టేజీ నుంచి కాలనీకి మిషన్ భగీరథ పైపులైన్లు,, కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు, కరెంటు, ప్రధాన రోడ్డుకు అప్రోచ్ రోడ్లు తదితర వసతులు కల్పించాలని కోరారు. గ్రామంలో మూడు రేషన్ దుకాణాలు ఒకే దగ్గర ఉండటంతో మిగతా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. భగత్‌సింగ్‌నగర్‌లో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని, ఉమ్మడి శ్మశాన వాటికకు అదనపు స్థలం కేటాయించాలన్నారు. గ్రామంలోని ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ఇళ్లు కోల్పోయే బాధితులకు పరిహారం అందించాలన్నారు. దళితులకు ఇళ్ల స్థలాలకు స్థలం కేటాయించిన పట్టాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో కుర్మయ్య, చిన్ననారాయణ, మాలకుర్మయ్య, కుర్వ హన్మంతు, పెద్దనారాయణ, కృష్ణయ్య, రాముడు, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రవాహానికి అడ్డుగా రాళ్లు



అడ్డుగా పెట్టిన రాళ్లను తొలగిస్తున్న రైతులు

పాన్‌గల్: మండలంలోని కిష్టాపూర్, గోప్లాపూర్, దావాజిపల్లి, పాన్‌గల్ గ్రామాలకు సరఫరా అయ్యే కేఎల్ఐ మైనర్ ఎంజే 4 కాల్వకు సాగునీరు సక్రమంగా పారకుండా రేమద్దుల సమీపంలో శాగాపూర్, సింగాయిపల్లి గ్రామాల రైతులు అడ్డుగా రాళ్లు పెడుతుండటంతో సాగునీరు సాఫీగా ముందుకు సాగడంలేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. రైతులు కాల్వలో దిగి పైపులకు అడ్డుగా ఉన్న రాళ్లు తొలగించారు. సాగునీరు ప్రవహించకుండా పైపులకు అడ్డుగా రాళ్లు పెడుతున్నారనే అనే విషయాన్ని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సమస్యను వివరించి కాల్వల ద్వారా సాగునీరు సాఫీగా ప్రవహించే విధంగా తగు చర్యలు తీసుకుంటూ రైతుల ఇబ్బందులను తొలగించాలని సూచించినట్లు రైతులు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ నుంచి అక్రమంగా తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టుకొని వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ వేణు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరుకు చెందిన వట్టిల సహనందు మండలంలోని మాందాపూర్ నుంచి బొలెరో వాహనంలో నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కోడేరుకు తరలిస్తుండగా పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. పట్టుబడిన రేషన్ బియ్యం వాహనాన్ని స్టేషన్‌కు తరలించి వాహనంలోని బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో పంచనామా నిర్వహించగా.. పట్టుబడిన బియ్యం రేషన్ బియ్యంగా నిర్ధారించినట్లు ఎస్ఐ తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కార్మికులను క్రమబద్ధీకరించాలి

ఆత్మకూర్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ క్రమబద్ధీకరిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీహరి, యూనియన్ అధ్యక్షుడు మక్బూల్‌బిన్‌సయ్యద్ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సతీష్, ఆశన్న, ఇస్మాయిల్, దశరథ్, అశోక్, లక్ష్మి, కమలమ్మ, రంజిత్, శివకుమార్, నరేందర్, కార్మికులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారంలో బుధవారం జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు, ఎంపికలను ప్రారంభించారు. అండర్ 17 బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొని వారి ప్రతిభ కనబర్చనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల బాలికలు చిన్న వయస్సు నుంచే చదువుతో పాలు క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రతిభ చూపిన వారిని జిల్ల స్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ పాల్గొన్నారు.

కులవృత్తులకు ప్రాణం పోసిన కేసీఆర్

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో కులవృత్తి చేస్తూ జీవనం సాగించే కుటుంబాలకు సీఎం కేసీఆర్ బీసీ బంధుతో ఆదుకున్నారని జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అల్లమాయపల్లిలో భాస్కరాచారి బీసీ బంధు రూ.లక్షతో కొనుగోలు చేసిన వడ్రంగి పనుల మిషన్‌ను బుధవారం ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, మండల సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డితో ప్రారంభించారు. కార్యక్రమంలో రాళ్ల కృష్ణయ్య, క్యామ రాజు, సత్యనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



గణేశ్ మండపాల వద్ద అన్నదానం



ఖిల్లాఘనపురంలో మట్టి వినాయకుడికి పూజలు చేస్తున్న మహిళలు



దుప్పల్లి బీసీ కాలనీలో..



వనపర్తిలో అన్నదానం చేస్తున్న ముస్లింలు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో గల మహాదేవ్ వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద బుధవారం పట్టణానికి చెందిన పలువురు ముస్లింలు అన్నదానం ఏర్పాటు చేశారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము పూజలు చేశారు. కార్యక్రమంలో గోనూరు యాదగిరి, బచ్చు రాము, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్ చందర్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సమద్ మియా, నాయకులు మీర్జా మునీర్, సయ్యద్‌బాషా, సులేమాన్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల వ్యాప్తంగా కొలువుదీరిన గణనాథుడికి భక్తులు నిత్యపూజలు చేస్తున్నారు. అప్పారెడ్డిపల్లిలో మూడు రోజుల పాటు పూజలు అందుకున్న వినాయకుడి నిమజ్జనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేలంలో ఎరుకలి విష్ణు రూ.18 వేలకు లడ్డును దక్కించుకున్నారు.

బీఆర్ఎస్‌తోనే పేదలకు న్యాయం



మాట్లాడుతున్న తిరుపతి యాదవ్

గోపాల్‌పేట: బీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త ప్రమోద్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి పార్టీ మండల నాయకులతో కలిసి ఏదుట్లలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ప్రభుత్వం సాగునీరు, రైతుబంధు, ఉచిత విద్యుత్, రైతుబీమా, మిషన్ భగీరథ, దళితబంధు, బీసీ బంధు ఇలా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తోందని చెప్పారు. ఇన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నందుకే తెలంగాణ రాష్ట్రం నుండి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్ళినవారు తిరిగివచ్చి వ్యవసాయం చేసుకుని బతుకుతున్నారని చెప్పారు. అనంతరం ఉదయం ఆరు గంటల నుంచి గ్రామంలోని వీధులు తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు శ్రీలత, తిరుపతి యాదవ్, వైస్ ఎంపీపీ శేఖర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోదండం, నాయకులు కోటిరెడ్డి

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఉత్తరయ్య

గోపాల్‌పేట: విద్యార్థినులు, మహిళలు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను వినియోగించుకోవాలని లోక్‌అదాలత్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఉత్తరయ్య అన్నారు. బుధవారం ఆయన మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాల, గోపాల్‌పేట జూనియర్ కళాశాలల్లోని విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగం కల్పించిన ప్రసాదించిన హక్కులను చట్టాలు కాపాడుతున్నాయని వివరించారు. బాలికలు న్యాయ శాస్త్రంలో ఆసక్తి కనబర్చి రాణించాలని సూచించారు. ఆపదలో ఉన్న బాలికలు 100కి డయల్ చేయడం లేదా సఖీ కేంద్రాన్ని సందర్శించి సమస్యలు చెప్పాలని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు, డేగల కృష్ణయ్య, లోక్‌అదాలత్ సిబ్బంది మనివర్ధన్‌రావు, శేఖర్, నరేష్‌గౌడ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆరోగ్యం, గోపాల్‌పేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య,

రిజర్వేషన్‌తో మహిళలకు అందలం



స్వీట్లు తినిపించుకుంటున్న మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళలకు 33శాతం రిజర్వేషన్‌తో మహిళామణులకు ఎంతో మేలు చేకూరనుందని పుర్‌చైర్‌పర్సన్ గాయత్రి, కౌన్సిలర్లు యాదమ్మ, నాగలక్ష్మి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మహిళా ఉద్యోగులు, కార్మికులతో కలిసి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. ప్రధాని మోదీతో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్, కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

మహిళా రిజర్వేషన్ బిల్లుతో మహిళామనులకు ఎంతోమేలు చేకూరుతుందని మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒందాపురం రాము, నాగేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు మిఠాయిలు పంపిణీ చేసారు. కార్యక్రమంలో బాలకృష్ణ, శ్యామ్, రాము, సూరి, చందు, శేషు, రఘు, విద్యార్థులు ఉన్నారు.

మహిళా బిల్లుకు సహకరించాలి

పాన్‌గల్: పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కళావతమ్మ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలోనే రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం పొందగా లోక్ సభలో తిరస్కరణకు గురైందని పేర్కొన్నారు. ఈ బిల్లు ఆమోదంతో చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లతో ఆయా సభల్లో మహిళల ప్రాధాన్యత పెరిగి ఎంతో మేలు జరుగుతుందన్నారు.

స్వచ్ఛతపై అవగాహన అవసరం



శ్రీరంగాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న సర్పంచ్ వినీలారాణి



పాన్‌గల్‌లో..



వీపనగండ్లలో..

పాన్‌గల్: ప్రతి విద్యార్థి పరిసరాల శుభ్రతపై అవగాహన పెంచుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవాపై బుధవారం ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ వంటి పోటీలను నిర్వహించారు. ఆయా పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. చిత్రలేఖనంలో పల్లవి (9వ తరగతి), సౌమ్య (7వ తరగతి), పల్లవి(9వ తరగతి), వ్యాస రచనలో వి.శ్రీకాంత్ (10 తరగతి), వినయ్‌కుమార్ (10వ తరగతి), శ్రీకాంత్ (10వ తరగతి) ఉపన్యాస పోటీల్లో వినయ్‌కుమార్ (10 తరగతి), భార్గవి (10వ తరగతి), సౌమ్య(7వ తరగతి), క్విజ్ పోటీల్లో వినయ్‌కుమార్, కీర్తన, చైతన్య, పల్లవి, భానుప్రియ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సర్పంచ్, హెచ్ఎం, ఉపాధ్యాయులు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రతపై తల్లిదండ్రులకు వివరించాలని సర్పంచ్ వినీలారాణి సూచించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన ఐదుగురికి బహుమతులు అందజేశారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంపై నిర్వహించిన ఉపన్యాస పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంపీడీఓ కతలప్ప, సర్పంచ్ నర్సింహారెడ్డి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. పారిశుద్ధ్యంపై బాలికలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్న సుదుద్దేశ్యంతో పోటీలను నిర్వహించినట్లు వారు తెలిపారు. ఉపన్యాస పోటీలో మల్లేశ్వరి ప్రథమ బహుమతి గెలుచుకోగా, దేవిక ద్వితీయ, చందన మూడో బహుమతిని అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ అరుణ, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.